క్లుప్తంగా

ఉపకరణాల కోసం వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలకు హాజరైన దివ్యాంగులు, తల్లిదండ్రులు

దర్శి: నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఉపకరణాల కోసం స్థానిక భవిత కేంద్రంలో బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల పరిషత్ అధ్యక్షుడు గోళ్లపాటి సుధారాణి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వసంత రావు నాయక్, మండల విద్యాశాఖ అధికారి రఘురామయ్య, బి.రమాదేవిలు హాజరై కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య పరీక్షలతో దివ్యాంగులకు ప్రయోజనం ఉంటుందని చెప్పారు. దివ్యాంగులు ఉపకరణాలు ఉపయోగిస్తే చదువులకు వైకల్యం అడ్డు రాదని తెలిపారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త పి.నాగేంద్రనాయక్ మాట్లాడుతూ భవిత కేంద్రంలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఎంతో మందిని ప్రధాన స్రవంతిలో చేర్పించినట్లు పేర్కొన్నారు. సుమారు 100 మంది మానసిక, అంధ, బధిరులు, కండరాల బలహీనత, కలిగిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులకు భోజన వసతి కల్పించారు. ఆర్టిఫిషియలిస్ట్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ముఖ్య ప్రతినిధి జోగేంద్ర, అసిస్టెంట్ నరసింహారావు, వివిధ మండలాల్లో పనిచేస్తున్న రిసోర్స్ ఉపాధ్యాయులు గోపాలుని సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాడు కళకళ.. నేడు వెలవెల!

- దొనకొండ రైల్వేస్టేషన్‌లో రాత్రిళ్ల ప్రయాణం రద్దు
- ఆగని రైళ్లు..అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- పాలకులు పట్టించుకునేనా? ప్రయాణికుల కష్టాలు తీరేనా?
- ఎంపీకి చెప్పినా ప్రయోజనం లేక ప్రయాణికుల పెదవి విరుపు



గతంలో నిర్వహించిన లోకో షెడ్డు (ఫైల్)

దొనకొండ (కురిచేడు):

గుంటూరు–నంద్యాల రైల్వేలైన్ మార్గంలో దొనకొండ రైల్వేస్టేషన్ ఏర్పడినప్పటి నుంచి ప్రయాణికులతో కళకళలాడింది. ఈ మార్గంలో ఏ రైలు బండి అయినా సరే దొనకొండ స్టేస్న్‌లో కనీసం 5 నిమిషాలు ఆగాల్సిందే. బొగ్గు ఇంజన్లు నడిచినంత కాలం లోకో షెడ్డు ఏర్పాటు చేసి ఇంజన్లకు మరమ్మతులు చేసే వారు. దొనకొండ ప్రాంతం నుంచి వేల మంది రైల్వేలో ఉద్యోగాలు సంపాదించుకుని జీవనం సాగించారు. రాత్రింబవళ్లూ ప్రయాణికులతో స్టేషన్ కళకళలాడేది. స్టేషన్ పరిసర ప్రాంతంలో చిరు వ్యాపారులు పదుల సంఖ్యలో ఆనందంగా జీవనం సాగించే వారు. బ్రాడ్గేజీ డీజల్ ఇంజన్లు వచ్చిన తర్వాత లోకో షెడ్ తొలగించినా రైళ్లు ఆగుతూ ప్రయాణికుల రద్దీ ఉండేది. కరోనా సమయంలో రద్దయిన రైళ్లు నేటికి పునరుద్ధరణగాక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చికిత్సల కోసం, వ్యాపారాల సరుకు కొనుగోలు కోసం నరసరావుపేట, గుంటూరు, విజయవాడ, మార్కాపురం తదితర ప్రాంతాలకు నిత్యం వందల మంది ప్రయాణం చేస్తుంటారు. వారి పనులు ముగించుకుని రాత్రికి ఇంటికి రావాలంటే తేదీ మారాల్సిందే. అక్కడే రైల్వేస్టేషన్లలో రాత్రంతా పడిగాపులు కాయాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ మార్గంలో నడిచే రైళ్లు దొనకొండ, కురిచేడు స్టేషన్లలో నిలపక పోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. దొనకొండ చేరాలంటే రైలు మార్గం మినహా బస్సులు కూడా లేకపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

ఎంపీ దృష్టికి సమస్య

ప్రయాణిలు పలుమార్లు సమస్యను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.



ప్రయాణికులు లేక వెలవెలబోతున్న దొనకొండ రైల్వేస్టేషన్

గుంటూరు నుంచి తిరుపతి వెళ్లే రైలు, అమరావతి ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం, ధర్మవరం రైళ్లు కురిచేడు రైల్వేస్టేషనులో ఆపాలని, దొనకొండలో రాత్రి వేళల్లో ప్రయాణించే కొండవీడు, అమరావతి, ప్రశాంతి, మచిలీపట్నం రైళ్లు నిలపాలని వేడుకుంటూ వినతి పత్రాలు కూడా సమర్పించినా ఫలితం లేదని ఈ ప్రాంత ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా ఎంపీ శ్రీనివాసులరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఈ రెండు స్టేషన్లలో రాత్రి వేళ రైళ్లు నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హామీలను గాలికి వదిలిన కూటమి సర్కార్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

త్రిపురాంతకం: చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని వైఎస్సార్ సీపీ నాయకుడు, సర్పంచ్ రాధాకృష్ణ అన్నారు. మండలంలోని ముడివేములలో బుధవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి చంద్రబాబు మోసాలు వివరించే క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఏదో విధంగా గెలవాలని హామీలు ఇచ్చారన్నారు. సంవత్సరమైనా ప్రజలకు హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గత ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేసిందని గుర్తు చేశారు. ప్రజలు అన్నీ గ్రహిస్తున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో ఉన్న వారి పింఛన్లు రద్దు చేయడం దుర్మార్గమన్నారు. వెంటనే పింఛన్లు పునరుద్ధరించాలని రాధాకృష్ణ డిమాండ్ చేశారు.

మాట తప్పడం చంద్రబాబు నైజం

పెద్దదోర్నాల: మాట ఇచ్చి తప్పటం సీఎం నారా చంద్రబాబునాయుడి నైజమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని చింతల, చింతల అగ్రహారం, బోడేనాయక్ తాండాలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. యర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు ఆ మూడు గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు. మండలానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. చింతల సర్పంచ్ వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ పోతన్న, కృష్ణానాయక్, సర్పంచ్ కోటిలింగం పాల్గొన్నారు.



పెద్దదోర్నాల: క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గణేష్ ఉత్సవ కమిటీలు నిబంధనలు పాటించాలి

కురిచేడు: వినాయక చవితి పర్వదినం సందర్భంగా గణపతి విగ్రహాలు ఏర్పాటు చేసుకునే ఉత్సవ కమిటీ సభ్యులు నిబంధనలు తప్పక పాటించాలని ఎస్సై ఎం.శివ సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపాల వద్ద మత్తు పానీయాలు సేవించరాదని, మైకులు, డీజేలు తక్కువ సౌండ్‌తో వినియోగించుకోవాలని, మండపాల వద్ద రాత్రి సమయాల్లో కూడా కమిటీకి సంబంధించిన మెంబర్స్ కొంతమంది లేక ఒక్కరైనా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, వలంటీర్స్‌ను నియమించుకోవాలని, పొలిటికల్ స్పీచెస్, ఇతర మతాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడరాదని, అసభ్యకర నృత్యాలు నిషేధమని, కనీసం రెండు సీసీ కెమెరాలు అమర్చాలని, నిమజ్జనాల సందర్భంలో మత్తుపానీయాలు తాగి కాలువలు లేదా సముద్రం వద్దకు వెళ్లరాదని, కరెంటు పోల్స్ దగ్గరగా లేదా మురుగు కాలవలపై విగ్రహాలు పెట్టరాదని, పోలీసుల అనుమతి లేకుండా రూట్ మార్చరాదని, నిమజ్జన తేదీలు మార్చరాదని చెప్పారు. గొడవలకు పాల్పడే వారిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాలని, పోలీసుల నుంచి వచ్చే సూచనలు ఎప్పటికప్పుడు పాటిస్తూ ఉండాలని ఎస్సై శివ సూచించారు.

యర్రగొండపాలెం: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలకు, నిమజ్జన ఊరేగింపులకు ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని సీఐ సీహెచ్ ప్రభాకరరావు, ఎస్సై పి.చౌడయ్య తెలిపారు. ఈ నెల 27న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం అవుతాయని, అప్పటి నుంచి మహా నిమజ్జన కార్యక్రమాలు జరుపుతారని, శాంతిభద్రతల దృష్ట్యా నిర్వాహకులు కొన్ని నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉందని తెలిపారు. అనుమతుల కోసం పోలీస్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేకంగా సమీక్షించి అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. గ్రామ స్థాయిలో ఏ ప్రదేశంలో వినాయక మండపం ఏర్పాటు చేస్తారు, ఎప్పుడు, ఎక్కడ నిమజ్జనం చేస్తారు, ఏ దారి నుంచి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్న అంశాలను దరఖాస్తులో పొందుపరచాలని తెలిపారు. గణేష్ మండపాలు ఏర్పాటు చేసేందుకు ఎంచుకున్న స్థలానికి సంబంధించిన యజమానుల నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవాలని, విద్యుత్ కోసం ఆ శాఖాధికారి అనుమతి ఉండాలని, సెల్లార్లు, కాంప్లెక్స్‌ల్లో నిర్వహించే ఉత్సవాలకు, డీజే బాక్సులు ఏర్పాటుకు కూడా పోలీసుల అనుమతులు తీసుకోవాలని, మండపం వద్ద రెండు స్పీకర్ బాక్సులు వాడాలని, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు స్పీకర్ బాక్సులపై నిషేధం ఉంటుందని చెప్పారు. మండపాల వద్ద కమిటీ సభ్యులు, వలంటీర్లు బ్యాడ్జీలు ధరించి భద్రతతో పాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించాలని, మండపాలకు అందుబాటులో విద్యుత్ తీగలు లేకుండా చూసుకోవాలని, అగ్ని ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని వారు కోరారు.

పుల్లలచెరువు: వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పని సరని ఎస్ఐ సంపత్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలపాల ఏర్పాటు కమిటీ సభ్యులు ఎన్వోసీతో పాటు ప్రభుత్వ నిబంధనలు తప్పని సరిగా పాటించాలన్నారు. ఊరేగింపుల సందర్భంగా డీజే బాక్సులకు తప్పని సరిగా అనుమతి తీసుకోవాలన్నారు. మండపాల వద్ద ప్రతి విషయానికి కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్

త్రిపురాంతకం: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్ విమర్శించారు. స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 20 నుంచి 25 వరకు 28వ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని చెప్పారు. మహాసభలకు ప్రతి నియోజకవర్గం నుంచి వెయ్యి మందిని తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచిపోయారన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని ప్రసాద్ హెచ్చరించారు. మహాసభల్లో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సీపీఐ, సీపీఎం నాయకులను ఆహ్వానించినట్లు తెలిపారు. ఈయన వెంట డి.శ్రీనివాస్, బి.రామయ్య, మల్లికార్జున్, పార్టీ నాయకులు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కేవీవీ ప్రసాద్

ఆలయాలను సందర్శించిన ద్వారక స్వామీజీ



త్రిపురాంతకం ఆలయం వద్ద కృష్ణానంద మహాకుండలేశ్వరస్వామి

త్రిపురాంతకం: త్రిపురాంతకంలోని ఆలయాలను ద్వారక కృష్ణానంద మహాకుండలేశ్వరస్వామి బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీబాలాత్రిపుర సుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాలను సందర్శించారు. త్రిపురాంతకం వచ్చిన ఆయనకు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణ శ్రీహనుమాన్ ఆలయం వద్ద సాదర స్వాగతం పలికారు. మండలంలోని మేడపిలో గణపతి ఆలయం, త్రిపురాంతకం శ్రీహనుమాన్ ఆలయాలను ఎవరి వద్ద ఒక్క రూపాయి ఆశించకుండా నిర్మిస్తున్న కృష్ణను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. లోక కళ్యాణం కోసం దేశమంతా పర్యటిస్తూ యజ్ఞ యాగాదులు చేశానని ఆయన తెలిపారు. వీరి వెంట హెచ్‌డీపీటీ జిల్లా సభ్యుడు ధనుంజయరావు, బీజేపీ నాయకులు అశోక్‌రెడ్డి, వీరాంజనేయులు ఉన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

తాళ్లూరు: ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.సత్యం అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ఉన్న వివిధ శాఖల అధికారులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మండల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యం

ఉత్తమ అధికారులకు ఘన సన్మానం

కురిచేడు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బెస్ట్ ఎంప్లాయిస్ అవార్డులు పొందిన అధికారులను ఎంఈఎఫ్ మండల అధ్యక్షుడు కేసనపల్లి కోటేశ్వరావు నాయకత్వంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహసీల్దార్ జి. రజనికుమారి హాజరయ్యారు. ఉత్తమ అవార్డులు పొందిన ఎంపీడీవో కేజీఎస్ రాజు, వెలుగు ఏపీఎం అనుపర్తి సైమన్, రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ నంబూరి ప్రీతిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు బొంత ఏసుదాసు మాదిగ, నియోజకవర్గ అధ్యక్షుడు గూడూరి యోగేశ్వరరావు మాదిగ, కురిచేడు మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కంభంపాటి జోసఫ్ మాదిగ, బడిపాటి మరియదాస్ మాదిగ, పెద్దవరం గ్రామ పార్టీ అధ్యక్షుడు మాగులూరి రామయ్య మాదిగ, ఎర్రగుంట్ల కోటేశ్వరరావు మాదిగ, దేకనకొండ ఎర్రగుంట్ల మోషే, కురిచేడు టౌన్ అధ్యక్షుడు కంభంపాటి ప్రశాంత్, కోలా రత్నం పాల్గొన్నారు.



ఉత్తమ అధికారులను సన్మానిస్తున్న ఎంఈఎఫ్ నాయకులు

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో ఇందిర అన్నారు. బుధవారం మండలంలోని కోమరోలు పాఠశాలను తనిఖీ చేసిన ఆమె ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం వారి నోట్ బుక్స్‌ను తనిఖీ చేసి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం నేర్పించాలని చెప్పారు. ఉపాధ్యాయుడు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారికి నాణ్యమైన విద్యను అందజేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థుల అభివృద్ధికి బాటలు వేయాలని ఎంఈఓ ఇందిర సూచించారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో ఇందిర

జర్నలిస్టుల స్థలాలకు రక్షణ కల్పించాలి

దర్శి: జర్నలిస్టులకు గతంలో ఇచ్చిన స్థలాలకు రక్షణ కల్పించాలని కోరుతూ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అధికారులకు బుధవారం వినతిపత్రం అందజేశారు. తమకు గతంలో పట్టాలు ఇవ్వగా ఆ స్థలాలకు నకిలీ అగ్రిమెంట్‌లు రాసుకుని ఇతరులకు విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాటిని అక్రమణదారుల పేరున ఆన్‌లైన్‌లో ఎక్కించే ఒప్పందంతో రూ.లక్షల్లో నగదు చేతులు మార్చుకునేందుకు సిద్ధం అయ్యారన్నారు. ఆ స్థలాలకు ఎటువంటి ఆన్‌లైన్‌లు చేయకుండా అక్రమించుకునే ప్రయత్నం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను జర్నలిస్టులు కోరారు.

నారు దశలోనే తెగుళ్లను నివారించాలి

కురిచేడు: వరి నారు ప్రధాన పొలంలో నాటే ముందు 200 లీటర్ల నీటిలో 200 ఎంఎల్ క్లోరి పైరిపాస్ మందును కలిపి ఎకరా పొలానికి సరిపడే నారును 12 నుంచి 14 గంటలు ముంచి నాటితే నాటిన 30 రోజుల వరకు కాండం తొలిచే పురుగు, ఉల్లికోడు, దోమను సమర్థంగా నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ తెలిపారు. మండలంలోని ముష్ఠ గంగవరం, కల్లూరు గ్రామాల్లో సాగు చేసిన మొక్కజొన్న, వరి పొలాలను బుధవారం ఆయన పరిశీలించారు.

మొక్కజొన్న పంటలో జింక్ లోపం గమనించామని, దీని నివారణకు రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ లీటర్ నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని తెలిపారు. వరి నారును ప్రధాన పొలంలో నాటే ముందు నారు కొసలు తుంచి నాటితే కాండం తొలిచే పురుగు గుడ్లను సమర్థంగా నివారించవచ్చని తెలిపారు. తూర్పు పడమర దిశలో ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్లు ఖాళీ బాటలు తీస్తే పంటలకు గాలి వెలుతురు బాగా తగిలి పురుగులు తెగుళ్ల ఉధృతి తగ్గడంతో పాటు 10 నుంచి 15 శాతం వరకు దిగుబడి పెరుగుతుందని తెలిపారు. రైతులు యూరియా, డీఏపీ కట్టలకు బదులుగా నానో యూరియా, నానో డీఏపీ వాడాలని సూచించారు.

బాబు సూపర్ మోసం



వై.పాలెంలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యర్రగొండపాలెం: రాష్ట్ర ప్రజలను చంద్రబాబు ప్రభుత్వం సూపర్‌గా మోసం చేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మిడత నరసింహారావు రైస్ మిల్ ఆవరణలో ఏర్పాటు చేసిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించి పేద ప్రజలకు అన్యాయం చేశారని విమర్శించారు. అనంతరం క్యూ ఆర్ కోడ్‌ను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు ఏకుల మునలారెడ్డి, ఆదిత్య విద్యా సంస్థల అధినేత సూరె రమేష్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు కె.ఓబులరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, ఎం.బాలగురవయ్య, ఆర్.అరుణాబాయి, మిడత నరసింహారావు, ఎస్.వెంకటరెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకులు కందూరి కాశీవిశ్వనాథ్, పబ్బిశెట్టి శ్రీనివాస్, షేక్ మహ్మద్ కాశిం, దోగిపర్తి సంతోష్ కుమార్, సూరె శ్రీనివాసులు, సూరె సంతోష్ కుమార్, గోళ్ల కృష్ణారావు, పాస్టర్ల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సన్నెపోగు సుందరరాజు పాల్గొన్నారు.